

కుటుంబ సభ్యులతో సరదాగా..
పోలింగ్ ఘట్టం ముగి సింది. ఇప్పటి వరకు ప్రచారంలో బిజీగా గడిపిన ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రస్తుతం కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నారు.
8లో▸



స్కాన్ చేయండి.. కథలు వినండి
విద్యార్థుల్లో పఠనస్థాయి పెంపొందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వేసవి సెలవుల్లో నవలలు, కథలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చదివేలా 'రూమ్ టు రీడ్' ద్వారా అందుబాటులోకి తెచ్చింది.
9లో▸

గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



జైలులో ఉన్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌టౌన్: అధైర్యపడొద్దని, మనోధైర్యంగా ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భైంసాలో జరిగిన సంఘటనకు సంబంధించి జిల్లా జైలులో ఖైదీలుగా ఉన్న హనుమాన్ దీక్షా పరులను మంగళవారం పరామర్శించేందుకు వారి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. జైలు అధికారులతో మాట్లాడి కలిసేందుకు ఏర్పాటు చేశారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్, నాయకులు ఉన్నారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో దివ్యాంగుల కోసం బుధవారం బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌ఫొటోతో బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ వద్దకు రావాలని సూచించారు. రూ.50 రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన 5 రోజుల భత్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా వారిపై పోలీసులతో లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల శిక్షణలో ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తారని చెప్పిన అధికారులే పనులు ముగించాక దాడులు చేయించడం సరికాదని పేర్కొన్నారు. ఘటనకు కారకులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకులపై ఫిర్యాదు



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌టౌన్: అసభ్యకర పదజాలంతో దూషించడంతో పాటు భౌతిక దాడులకు పాల్పడిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లాలో జరిగిన సంఘటనకు సంబంధించి మంగళవారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దాడులకు పాల్పడిన బీజేపీ నాయకులు, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అరెస్టు అయిన అమాయక యువకులను విడుదల చేయాలని కోరారు. తిర్పెల్లి ఖిల్లా పర్కోట కాలనీకి చెందిన గొర్ల రాము, అతడి సోదరుడు రాకేశ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీకి చెందిన మైనార్టీ మహిళలను అసభ్యకరంగా వారి వస్త్రధారణపై కామెంట్ చేశారని, ఓటు వేసే సమయంలో అడ్డుపడ్డారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా దుర్భాషలాడిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనయుడిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులే దాడులకు పాల్పడ్డారని, పోలీసులతో అమాయకులైన యువకులను అరెస్టు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. గొర్ల రాము, రాకేశ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట కంది శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

గెలుపుపై ధీమా



ఆదిలాబాద్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటింగ్‌పై విశ్లేషణ చేస్తున్న బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్



కార్యకర్తలతో పోలింగ్ సరళిపై విశ్లేషణ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ



జోగు రామన్నతో కలిసి కార్యకర్తలతో పోలింగ్‌పై విశ్లేషణ చేస్తున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు

- ఎవరి అంచనాలు వారివే
- పోలింగ్ సరళిపై పార్టీల్లో మొదలైన విశ్లేషణ
- లక్ష మెజార్టీ సాధిస్తామంటున్న బీజేపీ
- గెలుపు ఖాయమంటున్న కాంగ్రెస్
- ఆ లీడ్ కలిసివస్తుందంటున్న బీఆర్‌ఎస్
- జూన్ 4న తేలిపోనున్న భవితవ్యం

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇన్ని రోజుల పాటు ప్రచారంలో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు సేద తీరారు. బూత్‌ల వారీగా పార్టీకి పోలైన ఓట్ల విషయంలో నియోజకవర్గం వారీగా విశ్లేషణ సాగుతోంది. వాటి ఆధారంగా తమ పార్టీ ఆయా నియోజకవర్గాల్లో లీడ్‌లో ఉందని, మరికొన్ని చోట్ల ప్రత్యర్థి పార్టీతో పోటాపోటీగా ఉందని చెబుతున్నారు. ఈ లెక్కన ఎవరి అంచనాలు వారు వ్యక్తం చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఆ రోజు పార్టీల భవితవ్యం తేలిపోనుంది.

ఎవరి ధీమా వారిదే..
ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తున్నామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆసిఫాబాద్ మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు కమలం పార్టీకే పట్టం కట్టారని విశ్లేషిస్తున్నారు. ఆసిఫాబాద్‌లో ప్రత్యర్థి పార్టీలతో పోటీ ఉందని పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ పరిధిలో ఒకే ఒక స్థానం ఖానాపూర్‌లో గెలిచి మొత్తంగా బీఆర్‌ఎస్, బీజేపీల కంటే 2లక్షల ఓట్లు వెనుకబడ్డ తాము ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా అదనంగా ఓట్లు సాధించి గెలుపు వాకిట్లో ఉన్నామని కాంగ్రెస్ ఢంకా బజాయించి చెబుతోంది. ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో తమకు లీడ్ వస్తుందని బీఆర్‌ఎస్ అంటోంది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఫైట్ ఇచ్చామని పేర్కొంటున్నారు. కొద్దిపాటి మెజార్టీతో తమ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

అప్పుడు.. ఇప్పుడు

2019 పార్లమెంట్ ఎన్నికల్లో 14లక్షల 88వేల 353 ఓట్లకు గాను 10లక్షల 62వేల 895 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు 71.41 పోలింగ్ శాతం నమోదైంది. ఈసారి 1లక్ష 61వేల 822 కొత్త ఓటర్లు నమోదయ్యారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 74.03 శాతం పోలింగ్ నమోదైంది. ఈ లెక్కన కొత్త ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపారనేది ఆసక్తికరంగా మారింది. అలాగే ఈ ఎన్నికల్లో పురుషులు, మహిళల మొత్తం ఓట్లలో పోలైన ఓట్ల పరంగా శాతంలో కొంత పురుష ఆధిక్యం ఉంది. అయితే సంఖ్యా పరంగా మహిళా ఓటర్లు అధికంగా ఓట్లు వేశారు. ఈ లెక్కన వారి ఆదరణ కూడా ఎవరికి దక్కిందనేది ఈ ఎన్నికల్లో విజయానికి కీలకం కానుంది.

పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ వివరాలు
మొత్తం ఓటర్లు : 16,50,175
పోలైన ఓట్లు : 12,21,563 (74.03 శాతం)
పురుష ఓటర్లు: 8,04,875
పోలైన ఓట్లు 5,99,108 (74.43 శాతం)
మొత్తం మహిళా ఓటర్లు: 8,45,213
పోలైన ఓట్లు: 6,22,420 (73.64 శాతం)
ఇతరులు: 87
పోలైన ఓట్లు: 35 (40.23 శాతం)

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం..

సిర్పూర్	71.56
ఆసిఫాబాద్	75.49
ఖానాపూర్	72.20
ఆదిలాబాద్	73.89
బోథ్	78.16
నిర్మల్	71.68
ముథోల్	75.63

ఇదీ పరిస్థితి..
- అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల పరంగా ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే పార్లమెంట్ సెగ్మెంట్‌లో ముథోల్ రెండో స్థానంలో, ఆదిలాబాద్ నాలుగో స్థానం, నిర్మల్ ఆరో స్థానం, సిర్పూర్ ఏడో స్థానంలో నిలిచాయి. ఈ పోలింగ్ సరళి బీజేపీకి ఎలా ఉపయోగపడిందో అనేది ఫలితాల రోజే స్పష్టమవుతుంది.
- శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో గెలుపొందింది. ఈ నియోజకవర్గాల్లో ఈ పార్లమెంట్ ఎన్నికల పరంగా పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే.. ఈ మొత్తం సెగ్మెంట్‌లోనే బోథ్ అధిక పోలింగ్ శాతంతో మొదటి స్థానంలో నిలుస్తుంది. ఆసిఫాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఈ లెక్కన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు బీఆర్‌ఎస్‌కు తోడ్పడినట్టే ఈ ఎన్నికల్లో ఆదరించారో.. లేదో అనేది ఫలితాల రోజే తేలనుంది.
- అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పరంగా సెగ్మెంట్‌లో ఐదో స్థానంలో నిలిచింది. ఇది హస్తం పార్టీకి ఎంత మేరకు ఉపయుక్తంగా ఉంటుందో తేలాల్సి ఉంది.

స్ట్రాంగ్.. భద్రత



స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

- స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎంలు
- అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో సీల్
- ఆయా కేంద్రాలకు మూడంచెల బందోబస్తు
- కౌంటింగ్ వరకు 24 గంటలు సీసీ నిఘా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను పోలీసు భద్రత నడుమ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, పాలిటెక్నిక్, సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగిందిఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తరలించిన ఈవీఎంలను సరిచూసుకొని, వేర్వేరుగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఈవీఎంలను పాలిటెక్నిక్ కళాశాలలో, నిర్మల్, ముథోల్ ఖానాపూర్ నియోజకవర్గాల ఈవీఎంలను సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల ఈవీఎంలను సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంల్లో భద్రపరిచారు. మంగళవారం వేకువజామున 4గంటల సమయంలో ఎంపీ అభ్యర్థుల ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో ఆయా స్ట్రాంగ్ రూంలకు తాళాలు వేసి సీల్ వేశారు. వారితో సమావేశమై స్ట్రాంగ్‌రూంల వద్ద చేపట్టే భద్రత చర్యలను వివరించారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు శ్యామలా దేవి, దీపక్ తివారి, డీఆర్వో లోకేష్, మూడు జిల్లాల ఆర్డీవోలు వినోద్ కుమార్, రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషా

భద్రత చర్యలను పరిశీలించిన ఎస్పీ..
ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటర్ల ఓట్లు నిక్షిప్తమైన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన మూడు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత చర్యలను మంగళవారం పరిశీలించారు. టీటీడీసీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు చేరుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలోని మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎం, వీవీప్యాట్‌లను భద్రపర్చినట్లు తెలిపారు. మూడంచెల భద్రత చర్యల్లో భాగంగా మొదటి విభాగంలో కేంద్ర బలగాలైన సెంట్రల్ ఆర్మడ్ ఫోర్స్‌తో పహారా, రెండో భాగంలో జిల్లా రిజర్వ్ పోలీసులతో, మూడో భాగంలో పట్టణ పోలీసులతో గస్తీ నిర్వహిస్తూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ జరిగే వరకు ఈ భద్రత కొనసాగుతుందన్నారు. వర్షాలు, ఈదురు గాలులు వంటి ఆపత్కాల ఘటనలకు తట్టుకునే విధంగా గట్టి రక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లకు ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు పేర్కొన్నారు. అదనపు రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలను అమర్చి నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించే ప్రతి ఒక్కరి సంతకం భద్రత అధికారులు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఏ సమయంలోనైనా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో తనిఖీలు ఉంటాయన్నారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో మూడు చోట్ల భవనాల చుట్టూ పెట్రోలింగ్, గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఎమ్మెల్యే బొజ్జు, పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ ధీమా

ఉట్నూర్‌రూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల తీర్పుతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ అభ్యర్థి సుగుణ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గుచూపిన ఓటర్లకు, కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో పార్టీమండల అధ్యక్షుడు ఖయ్యూం, ఇక్బాల్, చంద్రయ్య, అజీం, సలీం, అలీం తదితరులు పాల్గొన్నారు.

'లక్ష మెజార్టీ సాధిస్తాం..'
కైలాస్‌నగర్: ఈనెల 13న జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి ఓట్లు వేశారని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి సుగుణ అన్నారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా తన గెలుపు ఖాయమని, ప్రజల ఆశీర్వాదంతో లక్ష మెజార్టీ తో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అధ్యక్షులు, మండల అధ్యక్షులతో పాటు పార్టీలోని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెబుతున్నట్లుగా ప్రకటించారు.

బీజేపీ డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌కు ద్రోహం

- గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిపై 'కంది' ధ్వజం
- 'పాయల్' రాజకీయ భస్మం తప్పదని మండిపాటు

కైలాస్‌నగర్: గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న నుంచి కట్టలకొద్ది డబ్బులు తీసుకుని పార్టీకి వెన్నుపోటుపొడిచిన గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ డబ్బులు తీసుకుని పార్టీ కార్యకర్తలను నమ్మించి నయవంచనకు గురి చేశారని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన వారి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ కోసం పనిచేస్తున్నట్లుగా నటించి బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకున్నట్లు ప్రజలే అంటున్నారని పేర్కొన్నారు. బీజేపీకి ఓటు వేయించినట్లు సాక్ష్యాలతో బయటపెడుతామని వాటికి ఆ ఇద్దరూ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని పదేపదే ప్రయత్నిస్తున్న వారికి కార్యకర్తలే సరైన బుద్ధిచెబు తారన్నారు. పాయల శంకర్ వన్‌టైం ఎమ్మెల్యేనని, డబ్బుమీదున్న అత్యాశే ఆయన్ను రాజకీయ భస్మం చేస్తుందని జోస్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

పంచదార.. ఇక లేనట్లేనా?

- నేటితో ముగియనున్న రేషన్ పంపిణీ గడువు
- డీడీలు కట్టిన డీలర్ల ఎదురుచూపు
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ

కైలాస్‌నగర్: దేవుడు వరమిచ్చినా... పూజారి కనికరించని చందంగా మారింది అంత్యోదయ అన్న యోజన కార్డుదారుల పరిస్థితి. చౌక ధరల దుకాణాల ద్వారా మే నెల కోటా నుంచి ఏఏవై లబ్ధిదారులకు పంచదార పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలతో కొంతమంది డీలర్లు డీడీలు కట్టినా అధికారులు చక్కెర సరఫరా చేయకపోవడంతో వారికి నిరీక్షణ తప్పట్లేదు. మరోవైపు ఈ నెల 20వ తేదీతో ఈ నెల కోటా బియ్యం పంపిణీ గడువు ముగియనుండగా, ఇప్పటి వరకు సరఫరాపై ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం.

రాయితీపై చక్కెర
ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అందించే ఉచిత బియ్యంతో పాటు ఏఏవై కార్డుదారులకు కిలో చొప్పున పంచదార విధిగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కార్డుకు రూ.13కు కిలో చొప్పున అందించాలని సూచిస్తూ ఆ సంస్థ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 14,245 ఏఏవై కార్డులుండగా.. 356 మంది డీలర్లు ఉన్నారు. ఇందులో 249 మంది డీలర్లు తమ వద్దనున్న కార్డుల సంఖ్యకనుగుణంగా బ్యాంకుల్లో డీడీలు తీసి అధికారులకు అందజేశారు. మొత్తం 14.24 మెట్రిక్ టన్నుల పంచదార అవసరం కాగా డీలర్లు 8.33 మెట్రిక్ టన్నుల పంచదార కోసం డీడీలు చెల్లించారు. అయితే ఇప్పటి వరకు ఆ సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో తమకు చక్కెరనైనా సరఫరా చేయలని లేదంటే తాము కట్టిన డీడీలను మరుసటి నెలకు వినియోగించేలా చూడాలంటూ డీలర్ల సంఘ ప్రతినిధులు పౌరసరఫరాలశాఖ అధికారులు ఇటీవల విన్నవించారు.



రేషన్ షాపులో బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

నేటితో ముగియనున్న పంపిణీ గడువు
బుధవారంతో రేషన్ బియ్యం పంపిణీ గడువు ముగియనుంది. ఇప్పటి వరకు పంచదార డీలర్లకు సరఫరా చేయకపోవడంతో ఈ నెలకు ఇక అందే పరిస్థితి కనిపించడం లేదు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సుధారాణిని ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా పంచదార సరఫరాకు సంబంధించి రాష్ట్రస్థాయి టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఫలితంగా ఈ నెలకు చక్కెర కోటా సరఫరా కాలేదు. అయితే డీడీలు కట్టిన డీలర్లకు అవసరమైన పంచదార పంపించాలని హైదరాబాద్ జిల్లా అధికారులతో మాట్లాడాం. అక్కడ నిల్వలు ఎక్కువగా ఉన్నట్‌లైతే జిల్లాకు పంపిస్తామని తెలిపారు. అది రాగానే కార్డుదారులకు అందజేస్తాం. లేనట్‌లైతే ఎన్నికలు ముగిసినందున జూన్ నుంచి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

బీజేపీ విజయం ఖాయం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, కొద్ది రోజులుగా జరిగిన ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు ప్రజలంతా ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నగేశ్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించిన సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అభ్యర్థి నగేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడ్డారని అన్నారు. భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో పార్టీ నాయకులు అశోక్, నగేష్, రవి, లాలామున్నా, ప్రవీణ్, దయాకర్, సంతోష్, రాజేష్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

క్లుప్తంగా

బావిలోపడి ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యాపల్‌గూడకు చెందిన బొల్లు నగేష్ (30) మంగళవారం ఫోన్ మాట్లాడుతూ వెళ్లి కచికంటి గ్రామ శివారులోని బావిలో పడ్డాడు. గమనించిన స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. మృతుని భార్య బొల్లు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

కుభీర్: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రే గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ (18) రెండేళ్లుగా కుభీర్ మండలంలోని చాతా గ్రామానికి చెందిన దేవేందర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ట్రాక్టర్‌తో హల్దా వైపు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. తండ్రి రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంకెట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం, లక్ష్మణచాంద మండలంలో విధులు నిర్వహిస్తున్న మరో ఉపాధ్యాయుడు ముత్యం సోమవారం ఉట్నూర్‌లో జరిగిన ఎన్నికల విధుల్లో పాల్గొని కారులో నిర్మల్ బయలుదేరారు. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని మహబూబా ఘాట్స్ వద్దకు రాగానే కారుకు అడ్డువచ్చిన అడవిపందులను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొట్టారు. దీంతో కారు బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ మండల కేంద్రానికి చెందిన లింగన్న–రుకుంబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. 2011లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఒక కుమారుడు వాగులో మునిగి చనిపోయాడు. మరో కుమారుడు కోలాపురి నవీన్ (27) జిల్లా కేంద్రంలోని ఓ ఆర్థోపెడిక్ వైద్యుడి వద్ద పనిచేస్తున్నాడు. కైలాస్‌నగర్‌లోని గెజిటెడ్ ఉద్యోగుల సంఘ భవనంలో మరో మిత్రుడితో కలిసి అక్కడే ఉంటున్నాడు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు తన స్నేహితుడితో కలిసి స్వగ్రామం సిరికొండకు వెళ్లాడు. ఓటు వేసిన అనంతరం స్నేహితుడు అక్కడే ఉండిపోగా నవీన్ జిల్లా కేంద్రానికి తిరిగి వచ్చాడు. మంగళవారం ఉదయం మరో స్నేహితుడు గెజిటెడ్ సంఘ భవనానికి టిఫిన్ చేసేందుకు వెళ్లి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఇద్దరు కుమారులు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఉట్నూర్‌రూరల్: ఇంట్లో రొట్టె చేస్తున్న ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ



ఉట్నూర్‌రూరల్: కుమారులతో చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నేరడిగొండ: కుటుంబ సభ్యులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కుటుంబ సభ్యులతో సరదాగా..

పార్లమెంట్ ఎన్నికల మహాక్రతువు ముగిసింది. ప్రచారంలో భాగంగా రెండునెలలపాటు నేతలు తీరిక లేకుండా గడిపారు. సోమవారం పోలింగ్ ముగియడంతో మంగళవారం సేదదీరుతూ కనిపించారు. రోజంతా ఇంట్లోనే ఉండి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. నాయకులు, కార్యకర్తలతో పోలింగ్‌సరళిపై సమీక్షించారు.

–ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలటౌన్/ఉట్నూర్‌రూరల్/భైంసాటౌన్/నేరడిగొండ/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్:



కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



ఆదిలాబాద్‌టౌన్: కార్యకర్తలతో ముచ్చటిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



భైంసాటౌన్: తమ నివాసంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్



మంచిర్యాలటౌన్: ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మంచిర్యాలలోని నివాసంలో బీజేపీ నాయకులతో 'గోమాస' సమీక్ష



మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



కాగజ్‌నగర్‌లోని నివాసంలో కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా చర్చ

- గెలుపుపై ఆశలు పెట్టుకున్న సదరు పార్టీ శ్రేణుల్లో కలవరం
- అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ



బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం సాగుతోంది. బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓ జాతీయ రాజకీయ పార్టీ ఓట్లు అనూహ్యంగా మరో జాతీయ రాజకీయపార్టీకి మళ్లాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈక్రమంలో గెలుపుపై ఆశలు పెంచుకున్న సదరు పార్టీ శ్రేణుల్లో కలవర పాటు మొదలైంది. కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఓ జాతీయ రాజకీయ పార్టీ తీవ్ర స్థాయిలో ప్రచారం సాగించగా అధికారంలో ఉన్న మరో జాతీయ పార్టీ మళ్లీ గెలవాలనే తలంపుతో పోటా పోటీగా ప్రచారం చేసింది. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్థిక, అంగబలం కలిగి ఉన్న అభ్యర్థిని నిలబెట్టి అతని గెలుపు కోసం సర్వ శక్తులు వొడ్డినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు తమతో సరితూగరనే ధీమా వ్యక్తం చేసి జోరుగా ప్రచారం నిర్వహించింది. ఓటర్లు తమవైపే ఉన్నారని, తమ అభ్యర్థి విజయం 'నల్లేరు మీద నడక' అన్నచందంగా వ్యవహరించారు. అయితే సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత కానీ ఓటరు నాడి బయటపడలేదని చెబుతున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన తీరుకు భిన్నంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేశారనే ప్రచారం అసెంబ్లీ నియోజకవర్గంలో కోడై కూస్తోంది. ఈతీరే అర్థబలం, అంగబలం ఉన్న అభ్యర్థికి ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ఓటర్ల తీరు మారిందా?

అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితికి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లలో ఎంతో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో తలపడిన ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ఈసారి ఓటర్లను ప్రభావితం చేయలేకపోయాయి. కేవలం ప్రచారంపైనే దృష్టిసారించి ఓటర్లను ఆకర్షించే యత్నాలకు తెర దించినట్లు తెలుస్తోంది. దీంతో ఓటర్ల మనోగతంలో ఒక్కసారిగా మార్పు వచ్చినట్లుగా చెబుతున్నారు. అర్థబలం కలిగిన ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థిపై ఆశలు పెంచుకుని తీవ్ర నిరాశకు గురైనట్లుగా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈకారణంగానే ఓటర్లు అనివార్యంగా మరో జాతీయ పార్టీ అభ్యర్థికి స్వచ్ఛందంగా ఓటు వేయాలని భావించినట్లుగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓ జాతీయ పార్టీని ఆదరించినట్లుగానే కేంద్రంలోనూ మరో పార్టీని గెలిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

క్రాస్ ఓటింగ్‌కు సై అన్నారా?

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్యనే పోటీ కనిపించింది. ఆ మూడు పార్టీల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసిన రాజకీయ పార్టీ గట్టిపోటీని ఇస్తుందని ప్రత్యర్థులు భావించారు. ఆ రెండు జాతీయ రాజకీయపార్టీలకు ఏమాత్రం తగ్గకుండా ప్రచార పర్వం హోరెత్తించారు. అయితే పోలింగ్ రోజున సదరు పార్టీ శ్రేణుల ఆలోచనల్లో మార్పు కనిపించినట్లుగా తెలుస్తోంది. సరైన పోటీని ఇవ్వలేక పోతున్నట్లు గ్రహించిన శ్రేణులు ఆఖరు దశలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టిన పార్టీపై కక్ష తీర్చుకునేందుకు ప్రత్యర్థి అయిన మరో జాతీయ పార్టీకి ఓట్లు వేయాలని గుట్టుగా ప్రచారం చేసినట్లు చర్చించుకుంటున్నారు. తాము గెలువక పోయినా ఫర్వాలేదు కానీ అర్థబలం కలిగిన అభ్యర్థిని ఓడించాలనే పట్టుదలతో క్రాస్ ఓటింగ్ చేయించినట్లు ప్రచారంలో ఉంది. అదే కనుక నిజమైతే అసెంబ్లీ ఎన్నికల్లో 3 వేల వరకు ఓట్లు సాధించిన సదరు జాతీయ పార్టీ ఈసారి గణనీయమైన ఓట్లు రాబట్టుకుంటుందని చర్చ జరుగుతోంది. గెలిచినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదనే కొందరు అంటున్నా గట్టి పోటీ మాత్రం తప్పదని విశ్లేషిస్తున్నారు. మరోవైపు సొంత పార్టీ శ్రేణులు సైతం క్రాస్ ఓటింగ్ చేయించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్వహణలోపం.. అలంకార ప్రాయం



రంగు వెలిసిపోయి కళావిహీనంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం

- టీటీడీ కల్యాణ మండపాన్ని పట్టించుకునేవారు కరువు
- సౌకర్యాల లేమితో అద్దెకు తీసుకోని ప్రజలు
- వృథాగా ఉండడంతో ఆదాయం కోల్పోతున్న వైనం

బెల్లంపల్లి: ధార్మిక , ఆధ్యాత్మిక, శుభకార్యాల నిర్వహణ కోసం బెల్లంపల్లి కేంద్రంగా నిర్మించిన తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) కల్యాణ మండపం అలంకార ప్రాయంగా మారింది. సరైన వసతులు, నిర్వహణ లేక వృథాగా ఉంటోంది. అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన మండపం మరింత అధ్వానంగా మారుతోంది.

శ్రీకోదండ రామాలయం పక్కన....

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీకోదండ రామాలయం పక్కన టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించారు. దశాబ్దకాలం క్రితం రూపుదిద్దుకున్న ఈ మండపంలో నాలుగైదు ఏళ్ల వరకు కార్యక్రమాలు జరిగాయి. అద్దెకు తీసుకుని పుర ప్రజలు శుభకార్యాలు జరిపించారు. ముఖ్యంగా వివాహాలు నిర్వహించారు. శ్రీకోదండ రామాలయానికి పోటీగా ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల కన్నా అతి తక్కువ ధరకు కళ్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడంతో పోటీపడి శుభ కార్యాలయాలు జరిపించారు. ఆ తర్వాత కార్యక్రమాల నిర్వహణ తగ్గుముఖం పట్టాయి. నిర్వహణను కూడా పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం ఏ కార్యాలూ జరుగడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల వైపే మొగ్గు ....

శాఖాహారులకు టీటీడీ కళ్యాణ మండపం ఎంతగానో ఉపయోగపడింది. మున్సిపాలిటీ పరిధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి, టీటీడీ కళ్యాణ మండపాలు శాఖహార వంటకాలకు వినియోగించడం జరుగుతుంది. ఇతర ఫంక్షన్ హాళ్లలో మాంసాహార వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో అనేక మంది అద్దె అధికమైనా ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లనే ఎంచుకుంటున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో ఆధునిక సౌకర్యాలు ఆకర్షిస్తున్నాయి. సౌకర్యాలను బట్టి వేల రూపాయల అద్దె వసూలు వసూలు చేస్తున్నారు. టీటీడీ కళ్యాణ మండపం అద్దె కేవలం రూ.2 వేల వరకు ఉండటంతో శాఖ హార ప్రియులు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నా.. నిర్వహణ సరిగా లేక ముందుకు రావడం లేదు. కొన్ని నెలల పాటు శ్రీకోదండ రామాలయ కమిటీకి టీటీడీ కళ్యాణ మండపం నిర్వాహణ బాధ్యతలను అప్పగించగా అద్దె చెల్లించే పరిస్థితులు కూడా లేకపోవడంతో నాలుగు నెలల క్రితం టీటీడీకి అప్పగించారు.

అసౌకర్యాలకు నిలయంగా..

కళ్యాణ మండపంలో సరైన సౌకర్యాలు లేవు. ముఖ్యంగా శుభ్రత లోపించింది. దీనిని నిర్మించినప్పుడు వేసిన రంగులు మినహా కొత్తగా వేయలేదు. దీంతో అవి వెలిసిపోయి భవనం పేలవంగా కనిపిస్తోంది. ఇక మండపాన్ని నిత్యం పర్యవేక్షించే అధికారులు కరువయ్యారు. అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో వాచ్‌మెన్, స్వీపర్ సరిగా విధులు నిర్వహించడం లేదు. దీంతో చెత్త చెదారం కళ్యాణ మండపంలో పేరుకుపోతోంది. దీంతో కళ్యాణ మండపాన్ని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. విశాలమైన గదులు, ఇతర సౌకర్యాలు ఉన్నా కూడా శుభకార్యాల నిర్వహణకు వెనుకాడుతున్నారు.

పర్యవేక్షణ చేయాలి



టీటీడీ కల్యాణ మండపాన్ని అద్దెకు ఇవ్వడానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయాలి. మండపంలో కార్యక్రమాల నిర్వహణకు తగిన వసతులు కల్పించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలుతీసుకోవాలి. మండపానికి రంగులు వేయించి ప్రజలు వినియోగించుకునేలా చూడాలి.

– పొట్ల సురేశ్, మాజీ కౌన్సిలర్, బెల్లంపల్లి

ఇబ్బందులు లేకుండా..



కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలు నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దాలి. అద్దెకు తీసుకున్నవారు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా సౌకర్యాలు కల్పించాలి. నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు.

– ఇప్ప రవి, సామాజిక కార్యకర్త, బెల్లంపల్లి

దొంగ ఓట్లు వేశారని ఫిర్యాదు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ మాజీ సర్పంచ్ సునీత–లింబాజీ దంపతులు రెండు చోట్ల ఓట్లు వేశారని మంగళవారం గ్రామస్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మేడంపల్లి పోలింగ్ కేంద్రంతో పాటు సుర్జాపూర్ పోలింగ్ కేంద్రంలో వేర్వేరుగా దొంగ ఓట్లు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సంబంధిత సెక్టోరల్ అధికారికి సైతం పోలింగ్ ముగియకముందే ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిన సర్పంచ్ దంపతులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, మేడంపల్లి మాజీ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్ నాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆకుల వెంకాగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు జంగిలి శంకర్, మంగ్లారపు సత్యనారాయణ, నాయకులు సంతోష్, మల్లేశ్, దేవోజీ, రవి, లక్ష్మణ్, శివ్‌లాల్, ప్రశాంత్, రంజిత్, సురేందర్, విలాస్, విశేష్, గణేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

బెజ్జూర్: ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని కృష్ణపెల్లి గ్రామానికి చెందిన ఆటో మంగళవారం మహారాష్ట్ర నుంచి ప్రయాణికులతో బెజ్జూర్‌కు వస్తుండగా కోయపల్లి–నాగపెల్లి గ్రామాల మధ్య అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఎలుకపెల్లికి చెందిన గోలేటి జానాబాయికి తీవ్రంగా సోనా బాల, హరీష్‌బాలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లాలో సోమవారం జరిగిన దాడికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. తిర్పెల్లి ఖిల్లాకు చెందిన గొర్ల రాము, గొర్ల రాకేష్ తమపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓటు వేస్తూ సెల్ఫీ దిగిన యువకుడిపై కేసు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలోని 37 పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తూ ఓ యువకుడు సెల్ఫీ దిగడంతో పోలింగ్ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని ఫోన్ సీజ్ చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు. యువకుడిపై ఐపీసీ 188 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శభాష్ వికేష్ సార్...



తాంసి: వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఆ ఉపాధ్యాయుడు పలువురిచే శభాష్ అనిపించుకుంటున్నాడు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న వికేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చదువులో వెనుకబడిన తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ పాఠాలు బోధిస్తున్నాడు. విద్యార్థులు సైతం క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. సెలవుల్లో సైతం విద్యార్థుల కోసం పాఠశాలకు వచ్చి బోధిస్తున్న ఉపాధ్యాయుడిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.